

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

సారంగాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల స్థానిక రాజీవ్ కాటన్ మార్కెట్ యార్డ్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మొక్కజొన్న రైతులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం విలేకరులతో రైతులు మాట్లాడుతూ చేతికి వచ్చిన మొక్కజొన్న పంటను అడవి పందులు, కోతులు ధ్వంసం చేస్తున్నాయన్నారు. పెట్టుబడి కూడా రాదని అలాగే దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండాలంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో మొక్కజొన్న కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధరను ప్రకటించి, రైతులను పాలకులు, సంబంధిత అధికారులు ఆదుకోవాలని కోరారు.

భవిష్యత్తు కోసం మన విత్తనాలు



బెంగుళూర్ నుంచి తీసుకువచ్చిన భూసార పరీక్షలు జరిపే అత్యాధునిక యంత్రం ఇదే





సంప్రదాయ విత్తనాలను ఉత్పత్తి చేసేందుకు సిద్ధంగా ఉంచిన భూములు ఇవే

- జిల్లాలో సంప్రదాయ విత్తనాలసాగుకు సరికొత్త కార్యాచరణ
- డీఆర్డీఓ ఆధ్వర్యంలో రూపకల్పన
- ఈ నెల 20న మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం
- మన విత్తనం - మన భవిష్యత్ పేరిట విస్తృత ప్రచారం
- మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థకు భాధ్యతలు

నిర్మల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సంప్రదాయసాగును పెద్ద ఎత్తున విస్తరించేందుకు ఓ సరికొత్త కార్యక్రమం అమలు కాబోతోంది. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టబోతున్న దేశీ సీడ్ కార్యక్రమాన్ని ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి సీతక్క అనసూయ ప్రారంభించబోతున్నారు. మన విత్తనం - మన భవిష్యత్తు (వాక్ ఫర్ దేశీ సీడ్), భూసార పరీక్ష. నేల తల్లికి రక్ష (మిట్టి దీదీ) పేరిట ఈ కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నారు. మన దేశీయ సంప్రదాయ విత్తనాలు అంతరించిపోకుండా చూడడమే కాకుండా వాటిని విస్తృతస్థాయిలో పెంచుతూ ఆ విత్తనాలతోనే పంటలన్నీ సాగయ్యే విధంగా చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఆశయంగా చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో ఇప్పటికే అనేక ప్రయోగాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్న డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి దేశీయ విత్తనాలను కాపాడేందుకే కాకుండా వాటిని విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇప్పటికే పౌనికి కలప ప్లాంటేషన్‌ను అమలు చేస్తున్న పీడీ కొండాపూర్ వద్ద సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇదే ఆలోచనతో పీడీ విజయలక్ష్మి జిల్లాలోని నాలుగు మహిళ రైతు ఉత్పత్తిదారుల సంఘాల భాగస్వామ్యంతో దేశీసీడ్ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. మొత్తం ఈ నాలుగు సంఘాల్లో 2000 మంది మహిళ రైతులు సభ్యులుగా ఉండడమే కాకుండా ఇప్పటికే సేంద్రియ పద్దతుల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ ప్రగతిదిశగా పయనిస్తున్నారు. ఇలాంటి మహిళలను మరింత ప్రోత్సాహించడమే కాకుండా వారి ఆలోచన విధానానికి మరింత పదును పెట్టే యోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఎంతో బలవర్ధకమైన మన సాంప్రదాయ విత్తనాలతో భవిష్యత్‌లో పంటలను సాగు చేయాలనేదే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. హైబ్రిడ్ విత్తనాలు పలు రసాయనాలతో తయారు చేస్తున్న విత్తనాల సాగు కారణంగా భూసారం తగ్గిపోవడమే కాకుండా పంటల్లో ఆరోగ్యకరమైన లక్షణ ప్రభావాలు కనుమరుగవుతున్నాయి. దీంతో ఈ పంటలను వినియోగించే వారు అనేక అనర్థాలకు, అనారోగ్యాలకు గురవుతున్నారు. దీంతో పాటు రసాయనిక ఎరువులు, విత్తనాలను గత కొంతకాలం నుంచి పెద్దమొత్తంలో వినియోగిస్తున్నందున భూసారం కూడా తగ్గిపోతోంది. భూసారం తగ్గిపోవడంతో పంటల దిగుబడి గణనీయంగా పడిపోతోంది. దీంతో పాటు పంటల్లో నాణ్యత సైతం లోపిస్తోంది. ఇలాంటి అవాంతరాలన్నింటినీ అధిగమించి బలవర్ధకమైన దేశీయ విత్తనాలతోనే ఇక పంటల సాగుకు శ్రీకారం చుట్టాలన్న ఆశయంతో ఈ దేశీ సీడ్ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.



వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వాక్ ఫర్ దేశీ సీడ్ (మన విత్తనం - మన భవిష్యత్తు)

దేశీయ విత్తనాల సాగును పెంచడమే కాకుండా ఆ విత్తనాలతోనే పంటలన్నింటిని పెద్ద ఎత్తున సాగు చేయాలనే లక్ష్యంతో వాక్ ఫర్ దేశీ సీడ్ (మన విత్తనం - మన భవిష్యత్తు) పేరిట ఈ కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నారు. ఈ కార్యక్రమంలో కేవలం మహిళ రైతులకే భాగస్వామ్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో నాలుగు మహిళ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కొనసాగుతుండగా ఈ సంఘాల్లో 2000 మంది మహిళ రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఇప్పటికే సంప్రదాయ పంటలసాగుతో పాటు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల లాంటి వ్యవహారాల్లో శిక్షణలు సైతం పొందారు. వీరు చాలా చోట్ల క్షేత్ర పర్యటనలను కూడా పూర్తి చేశారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని కొండాపూర్ వద్ద గల సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ ఎరువులతో కూడిన పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో మహిళ రైతులు ఇప్పటికే గణనీయంగా సంప్రదాయ విత్తనాలతో పంటల సాగును నిర్వహిస్తున్నారు. అయితే ఈ సాగు విధానాన్ని కొంతమందికే పరిమితం చేయకుండా జిల్లావ్యాప్తంగా విస్తరించేందుకోసం డీఆర్డీఏ నడుం బిగించింది. ఇందులో భాగంగానే దేశీ సీడ్ (మన విత్తనం - మన భవిష్యత్తు) పేరిట ఈ కొత్త తరహా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

పొరుగు రాష్ట్రాల నుంచి సంప్రదాయ విత్తనాల దిగుమతి

ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాలు, మహారాష్ట్రలోని సోలాపూర్‌లలో గత కొంతకాలం నుంచి దేశీయ (సంప్రదాయ విత్తనాల) సాగును పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల సాగు సమాచారాన్ని తెలుసుకున్న డీఆర్డీఏ జిల్లాలోని రైతు మహిళ ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులను అక్కడికి అధ్యయనం కోసం పంపారు. అక్కడ దేశీయ విత్తనాల సాగు మెళకువలను ఈ మహిళ సంఘాలు తెలుసుకున్నాయి. దీంతో నిర్మల్ జిల్లాలో కూడా ఈ తరహా కార్యక్రమాన్ని అమలు చేయాలని తలపెట్టాయి. దీని కోసం గాను సోలాపూర్ ఉభయ గోదావరి జిల్లాల నుంచి వరి, జొన్న, నువ్వులు, కందులు, కూరగాయల విత్తనాలను ఇక్కడికి తీసుకువచ్చి దేశీ సీడ్ సాగును చేపట్టబోతున్నారు. మొదట మహిళ రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో ఈ సాగు ప్రక్రియను కొనసాగించి అన్ని గ్రామాలకు ఈ సాగు ప్రక్రియను విస్తరించనున్నారు. దశల వారీగా ఇక అన్ని గ్రామాల్లోనూ సంప్రదాయ దేశీయ విత్తనాలతోనే పంటలసాగును కొనసాగించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో కూడా కలిసి సమన్వయంగా ఈ కార్యచరణను అమలు చేయనున్నారు.

విస్తృతంగా భూసార పరీక్షలు

ఈ కార్యక్రమంలో భాగంగానే భూసార పరీక్ష నేల తల్లికి రక్ష పేరిట గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా భూసార పరీక్షలను చేపట్టబోతున్నారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా దేశీసీడ్ కార్యక్రమాన్ని మొదట అమలు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా పంటసాగుతో వేగంగా భూసారం తగ్గిపోతున్నట్లు సంబంధిత శాఖలు నిర్ధారించాయి. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగు కోసం కొంతకాలం నుంచి రైతులు రసాయనిక మందులను పెద్దమొత్తంలో వినియోగిస్తున్నారు. దీని కారణంగా తాత్కాలికంగా దిగుబడులు పెరుగుతున్నప్పటికీ క్రమంగా భూసారం తగ్గిపోతోంది. దీంతో భవిష్యత్‌లో పంటల సాగు కష్టతరమయ్యే ప్రమాదం ఉం దంటూ అధికారులు గుర్తించారు. భూసారం తగ్గకుండా పంటల దిగుబడులను పెంచేందుకు హైబ్రిడ్ విత్తనాలను పక్క పెట్టి దేశీ విత్తనాలనే ఇక నుంచి సాగుకోసం వినియోగించాలని నిర్ణయించారు. భూసార పరీక్షల కోసం పూర్తి సాంకేతికతను వినియోగించుకోబోతున్నారు. దీని కోసం గాను బెంగుళూర్ నుంచి ప్రత్యేక పరికరం కొనుగోలు చేశారు. ఈ పరికరంతో భూసారం ఎలా ఉందో అంశాన్ని తేల్చనున్నారు. అలాగే భూసారం ఎక్కువగా ఉన్న చోట మొదట దేశీయ విత్తనాల సాగుకు ఉపక్రమించనున్నారు. భూసారం తక్కువగా ఉన్న చోట సేంద్రియ ఎరువులను విస్తృతంగా ఉపయోగిస్తూ అక్కడి భూసారాన్ని పెంపొందించే ప్రయత్నాలు కూడా చేయనున్నారు.



మన విత్తనం - మన భవిష్యత్తు అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

బీసీ నిరుద్యోగులకు డ్రైవింగ్‌లో శిక్షణ

నిర్మల్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ బీసీ యువతి యువకులకు వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఆర్టీసీ హకీంపేట హైదరాబాద్‌లో ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో లైట్ మోటార్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించనుందన్నారు. హెవీ వాహనానికి 20 నుండి 45, లైట్ వాహనానికి 18 నుండి 45 వయసులోపు వారు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతం వారికి లక్షన్నర, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఆదాయం ఉండాలని, ఆధార్, కుల ధ్రువీకరణ, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 31 లోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కరణ్‌సింగ్ మృతదేహం

నిర్మల్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గండిరామన్న ఆలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం కరణ్ సింగ్(22) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... వైఎస్ఆర్ కాలనీకి చెందిన సయ్యద్ అజీమ్ తన పల్సర్ బైక్‌పై అదే కాలనీకి చెందిన చవాన్ కరణ్ సింగ్, నర్సింగ్‌తో కలిసి చించోలి గ్రామంలో పని నుంచి తిరిగి వస్తుండగా అజీమ్ తన బైక్‌పై అదే దిశలో వెళ్తున్న టిప్పర్‌ను ఓవర్టేక్ చేసి కింద పడిపోయాడని తెలిపారు. ఈ ప్రమాదంలో కరణ్‌సింగ్ మరణించగా మిగతా వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరి మృతి



సాయికిరణ్ (ఫైల్)

సోన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఎస్.సాయికుమార్(28) చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెందాడు. గాంధీనగర్‌లోని సరస్వతి కెనాల్‌లో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చేపలు పట్టే వల కాలుకు తట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాడు.

హిమాద్రి ఎంటర్‌ప్రైజెస్ ఆస్తుల జప్తు



నిర్మల్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని హిమాద్రి ఎంటర్ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆస్తులను మున్సిపల్ అధికారులు మంగళవారం జప్తు చేసి సీజ్ చేశారు. ఆస్తి పన్ను బకాయిలున్న టాప్ వంద మందిలో ఈ కంపెనీ ఒకటని తెలిపారు. బకాయిలు కట్టకపోవడంతో ఆస్తులు జప్తు చేసి సీజ్ చేసినట్టు రెవెన్యూ అధికారి అనూప్‌కుమార్ తెలిపారు. పట్టణ ప్రజలు సకాంలో పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జ్ఞానేశ్వర్, బిల్ కలెక్టర్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పన, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు షెడ్యూల్ ప్రకారం ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజు తాగునీటిని అందించాలన్నారు. బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పశువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు బావులకు మరమ్మతులు చేయాలన్నారు. తాగునీటి వృధాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట తాగునీటి పైపులకు మరమ్మతులు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాల గుర్తింపును వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయనే భరోసా ప్రజల్లో కల్పించాలన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధిని కల్పించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, ఓఆర్ పొట్లాలు సరిపడినన్ని ఉపాధి హామీ ప్రదేశాల్లో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట ఈజీఎస్ నిధుల ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టాలని తెలిపారు. అనంతరం పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా మండలాల పరిధిలోని ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజలు దరఖాస్తులు చేసుకున్న ఆదాయ, కుల, నివాస, తదితర పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న పలు పౌర సేవల ధ్రువీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్‌లు, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి బోర్డు పరీక్షల నిర్వహణకు సంబంధించిన సంబంధిత శాఖ అధికారులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదవ తరగతి పరీక్షలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 9,129 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందుకు గాను 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల ప్రశ్న, జవాబు పత్రాల తరలింపు సమయంలో పోలీసులు భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ పొట్లాలు, ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు జరిగే సమయాల్లో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని, 144 సెక్షన్ అమలుపరిచి, పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రహరీ గోడలు లేని పరీక్షా కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పించాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. అనంతరం పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నియ మాలను తప్పనిసరిగా పాటిస్తూ, పరీక్షలను నిర్వహించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో పి.రామారావు, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, విద్యుత్‌శాఖ డీఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు పద్మ, లింబాద్రి, ప్రవీణ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

- లక్ష్మణచాంద మండలంలో అత్యధికంగా 40.7 డిగ్రీలు

ఖానాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకు ఎండ తీవ్రతరం అవుతోంది. భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తుం డడంతో ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయి. నిర్మల్ జిల్లాలో మంగళవారం ఆరు మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు జిల్లాలోని లక్ష్మణచాంద, పెంబి, మామడ, ఖానాపూర్, నర్సాపూర్(జి), నిర్మల్ రూరల్ ఆరు మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. లక్ష్మణచాంద మండలంలో అత్యధికంగా 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం 9 గంటల నుండి వాతావరణం వేడెక్కడంతో పాటు తీవ్రమైన ఉక్కపోత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జనం ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు.

త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించండి

మామడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మామడ మండలంలోని వాస్తాపూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్ ఆదివాసి గూడెంకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావుకు వినతిచేశారు. పెంబి మండలం నుండి సింగిల్ ఫేస్ విద్యుత్ ఉందని పంటలు సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సౌకర్యం కల్పిస్తామని శ్రీహరిరావు హామీ ఇచ్చారు.

సోన్ సర్కిల్ సీఐగా గోవర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



సోన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సోన్ సర్కిల్ సీఐగా గోవర్ధన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో పని చేసిన ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు సీఐగా పని చేసిన నవీన్ కుమార్ హైదరాబాద్‌లోని డీజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐకి కార్యాలయ సిబ్బంది, సర్కిల్ ఎస్సైలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఏజీపీగా నయీముల్లా ఖాన్ నియామకం



శ్రీహరిరావును కలిసిన ఏజీపీ నయీముల్లాఖాన్

నిర్మల్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నయీముల్లాఖాన్ నియమితులయ్యారు. ప్రభుత్వం నయీముల్లాఖాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నయీముల్లాఖాన్ మర్యాదపూర్వకంగా మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావును ఆయన నివాసంలో కలిశారు. శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. నగరేశ్వరవాడకు చెందిన సీనియర్ న్యాయవాది నయీముల్లాఖాన్ ఏజీపీగా నియామకం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అయ్యన్నగారి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

రోగుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రోగుల వివరాలు ఈహెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ సూచించారు. మంగళవారం వైద్యాధికారులు, నర్సింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెరుగైన సేవలందించేందుకు నమోదు చేసిన వివరాలు దోహదం చేస్తాయన్నారు. డేటా మేనేజర్ గంగాధర్, సబ్ ఇంజనీర్లు రమణ, సంతోష్, శిక్షణ ఇచ్చారు.

విద్యార్థి సంఘ నాయకులు అరెస్ట్

నిర్మల్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ విద్యార్థి సంఘ నాయకులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పూదరి బిట్టు, రిజ్వాన్ ఖాన్, చందుల చరణ్ ఉన్నారు.

బాసర మండలంలో..

బాసర, మార్చి, 18 : (ఆంధ్రజ్యోతి) : మండల బీఆర్ఎస్ నాయకులను స్థానిక పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్వీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో ఈ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయమే బాసర మండల బీఆర్ఎస్ అధ్యక్షులు కోర్వశ్యామ్, డి. రవి, సాయికృష్ణ, వాజీద్ వంటి యువ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

యువత గంజాయి బారిన పడకుండా శ్రద్ధ వహించాలి : డీఎస్పీ

ఆదిలాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): యువత గంజాయి మత్తు బారిన పడకుండా తల్లిదండ్రులు వారిపై శ్రద్ధ వహించాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గంజాయి అమ్మినా, తాగినా చట్టప్రకారం నేరమని, ప్రతీఒక్కరిపై కఠిన చర్యలే తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి మహమ్మారిని అరికట్టే వరకు జిల్లా పోలీస్ యత్రాంగం కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఐదుగురు గంజాయి స్మగ్లర్లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఇద్దరు గంజాయి అమ్మేవారు, ఒకరు గంజాయి పండించేవారు కాగా, ఇద్దరు గంజాయి తాగేవారు ఉన్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి 35 గ్రాముల గంజాయి, 5 సెల్‌పోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితుల్లో కృష్ణపల్లి వంశీది జగిత్యాల జిల్లా కొత్తపేట గ్రామం, కృష్ణపల్లి మల్లేష్‌ది జగిత్యాల జిల్లా కొత్తపేట గ్రామం, కుమ్ర మహదుది ఆదిలాబాద్ రూరల్ మండలం లింగుగూడ గ్రామం, తుల్జాపురి అజయ్, అలాల తిరుమలేష్‌ది శాంతినగర్ కాలనీ ఆదిలాబాద్ పట్టణంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సునీల్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై అశోక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల సమయం ఇవ్వండి.. విద్యుత్ వైర్లు తొలగిస్తాం : సీఈ చౌహాన్

నేరడిగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో రైతులు సాగు చేస్తున్న పంట పొలాల్లో విద్యుత్ వైర్లు వేశారని అటవీ శాఖ అధికారులు విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్‌కు నోటీసులు అందజేశారు. ఇందుకు సమాధానం తెలపకపోవడంతో సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ ఎఫ్ఆర్‌వో నాగావత్ స్వామి, కుంటాల డిప్యూటీ రేంజ్ అధికారి లఖన్‌సింగ్, అటవీ శాఖ అధికారులు నేరడిగొండ మండల కేంద్రంలో గల విద్యుత్ శాఖ కార్యాలయానికి మంగళవారం వెళ్లారు. అక్కడ ఉన్న ఏఈ నాగేంద్ర ప్రసాద్‌ను అరెస్టు చేస్తామని అటవీ శాఖ అధికారులు వెళ్లడంతో అక్కడే ఉన్న విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ జైవంత్‌రావు చౌహాన్ డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల టైమ్ ఇవ్వండి. విద్యుత్ వైర్లను, స్తంభాలను తొలగిస్తామని చెప్పడంతో ఈ వివాదం సద్దుమణిగింది. అంతకుముందు విద్యుత్ శాఖ అధికారులు ఆందోళన చెందారు. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఎలాంటి పనులు చేయరాదన్న ఆదేశాలు ఉండడంతో విద్యుత్ శాఖ అధికారుల తప్పిదంతో సాయిదత్త కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన వారు ఈ విద్యుత్ వైర్లు, స్తంభాలను వేశారు. ఈ విషయం కిందిస్థాయి ఉద్యోగుల తప్పిదంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నట్లు చర్చించు కుంటున్నారు. కొందరు మామూళ్లకు అలవాటుపడి ఇలా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఇలా జరగకుండా చూడాలని కోరుతున్నారు.

యువకుడికి గ్రామస్థుల సన్మానం

తలమడుగు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన బిట్ల పెద్ద గంగన్న కుమారుడు బిట్ల చైతన్య హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్గా ఉద్యోగం సాధించిన సందర్భంగా.. స్థానిక స్వామి వివేకానంద గ్రంథాలయంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, గ్రామస్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. గత సంవత్సరం గ్రంథాలయానికి గోక గణేష్‌రెడ్డి 50,000 వేల రూపాయలు దాతలు ఇచ్చిన సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఇదే స్ఫూర్తితో యువకులు అవకాశాలను సద్వినిగా మర్చిపోవాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచ్ పోతారెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, గోసెల గంగన్న, బిట్ల చిన్న గంగన్న, కారోబార్ సంజీవరెడ్డి, కాంతారావు, వెంకటేష్ యాదవ్, ఎన్ అశోక్, లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి ప్రణీత



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

● ఉన్నత పాఠశాల వేడుకల్లో డీఈవో ప్రణీత

తలమడుగు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కన్న తల్లిదండ్రులను.. చదివిన బడిని.. చదువులు నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దని జిల్లా విద్యాధికారి ప్రణీత కోరారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ డే, స్పోర్ట్స్‌డే వేడుకలు సమావేశానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకమైంది అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరుకావాలని కోరారు. ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలు, పదివేల ఒక వంద ఆరు మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటాయన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి ప్రతీ విద్యార్థి 10 జీపీ సాధించాలని కోరారు. ఈసారి పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం గత మూడు నెలల నుంచి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆరోగ్య పాఠశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సాధించడం జరిగిందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా తలమడుగు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం దాతల ముందుకు వచ్చి అన్నిరకాల సౌకర్యాలు కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతీ, సంప్రదాయ ముత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఆదర్శ అమ్మ కమిటీ చైర్మన్ సునంద, మాజీ చైర్మన్ గంగన్న, బీఆర్ఎస్ పార్టీ రైతు సంఘం జిల్లా నాయకులు కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు

ఉట్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ విసి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో మంగళవారం బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులను పూనుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్‌ను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే, నాయకులు మొహమ్మద్ ముజీబ్, క్రాంతి కుమార్, బాబా శ్యాం, సాజిద్, పొన్నం సాయి, సుమన్ తదితరులను అరెస్ట్ చేసి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కాగా నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని బైండోవర్ చేసి వదిలి పెట్టారు.

ఎస్సీ వర్గీకరణ చట్టంతో వెనకబాటుకు గురైన మాదిగలకు న్యాయం జరగాలి

ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి 18: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు.. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గత 7 రోజులుగా ఆదిలాబాద్ జిల్ల కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎుందు ఆరెల్లి మల్లేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి శాసనసభలో మాట్లాడిన మాటలు నిలుపుకోవాలని, అదేవిధంగా ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలన్నారు. ఈ నిరసన దీక్షలో ఆదివాసీ మహిళ ప్రతినిదలు రాయిసీడం రమ, రామంచ లక్ష్మి, సీనియర్ నాయకులు ఎంపెల్లి గోవర్ధన్, లక్ష్మణ్, మనోజ్, శంకర్, పోచన్న, ప్రభాకర్, నవీన్, వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు.

బోథ్: అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న ఎస్సీ వర్గీకరణ బిల్లును శాస్త్రీయబద్ధంగా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి చేరుకున్నాయి. దీక్షలో రాష్ట్ర సీనియర్ నాయకులు కూడాల స్వామి, జిల్లా నాయకులు కార్యం రవి, స్వామి, రమణయ్య, కంసాల అనిల్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్‌లో ఉపాధి హామీ ప్రజా వేదిక

నార్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన రూ.9 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు ఖర్చుపై 14వ విడత సామాజిక ప్రజా వేదికను మంళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ ప్రజా వేదిక సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో పీడీ రవీందర్ రాథోడ్ హాజరయ్యారు. కాగా, ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ ప్రజా వేదికకు రావాల్సిన గ్రామ, మండల ప్రజలు లేకపోవడం.. కేవలం ఎడిట్‌కి సంబంధించిన సిబ్బంది, ఉపాధి సిబ్బంది ఉండడంతో జిల్లా అధికారి ఉపాధి హామీ ఏపీవో ఈసీపై మండిపడ్డారు. ఉపాధి హామీ పనులు కూలీల కోసం ఉన్నాయా? లేదా సిబ్బంది కోసమా? అంటూ ప్రజావేదిక సాక్షిగా వారిపై ఆయన మండిపడ్డారు. ఉపాధి సిబ్బంది పనితీరు బాగా లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొద్దిసేపు ఉండి సభ నుంచి నుంచి తిరిగి వెళ్లిపోయా రు. అంతేకాకుండా కూలీలకు నష్టం చేసిన ఉపాధి హామీ సిబ్బందిపై జరి మానా, రికవరీ విధించినా.. అధికారులు వారిపై తప్పు చేసినందుకు వారిపై వేటు ఎందుకు వేయలేదని గ్రామస్థుల్లో చర్చలు జరిగాయి.

‘అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు’

సిరికొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌పై అబద్ధపు ప్రచారాలు చేస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ నాయకులు కాలం వెల్లదీస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న అన్నారు. మంగళవారం ఆయన సిరికొండ మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు మాట్లాడుతున్నారనడం కాంగ్రెస్ నాయకులకి సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా.. ఇప్పటి వరకు మేనిఫెస్టోలోని పథకాలు అమలు చేయడంలేదన్నారు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని గళం విప్పిన ఎమ్మెల్యేను కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సరికాదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

బల్దియాలో.. బ్లాక్‌మెయిల్ దందా

(5వ పేజీ తరువాయి...)

మంది ముఖ్యనేతలకు కూడా ఫేక్ డోర్ నెంబర్లను కేటాయించినట్లు తెలుస్తుంది. ఇప్పటికీ మున్సిపాలిటీలో ఫేక్ డోర్ నెంబర్‌ల దందాకు అసలు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ

మున్సిపాలిటీ పాలనా వ్యవహారాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఉట్నూర్ ఐటీడీఏ పీవో వ్యవహరిస్తున్నా.. అసలు పర్యవేక్షణ లేకుండా పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు అధికారులతో ఒకసారి కూడా సమీక్షా సమావేశం నిర్వహించకపోవడంతో.. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలపై సరైన అవగాహన లేకపోవడంతో పాలనా పట్టుతప్పుతోందంటున్నారు. ప్రత్యేక పాలన ప్రారంభమై రెండు నెలలు దగ్గర పడుతున్నా.. మున్సిపల్ వైపు ఉన్నతాధికారులు ఎవరూ కన్నెత్తి చూడకపోవడంపై పట్టణంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుతప్పుతున్న మున్సిపాలిటీని గాడిలో పెట్టేందుకు ఉన్నత అధికారులు ఇకనైనా ప్రత్యేక దృష్టిని సారించాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాంసి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కినాక ప్రసాద్ (32) అనే యువకుడు హోలీ రోజున రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లిన ప్రసాద్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన ఆయన అయ్యప్ప దీక్షతో పాటు, గ్రామస్థులు అందరితో కలుపుగోలుగా ఉండేవారని గ్రామస్థులు పేరుకున్నారు. ఉచితంగా చిన్న పిల్లలకు విద్య నేర్పిన ప్రసాద్ అందరికీ ఆదర్శంగా నిలిచారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. ప్రసాద్ మృతితో తాంసిలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ద్విచక్ర వాహనాలు ఢీకొని మరొకరు..

ఉట్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని గూడమామడకు చెందిన కుమ్ర బక్కు(50) మృతి చెందినట్లు ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు తెలిపారు. ఘన్‌పూర్ ప్రాంతంలో జరిగిన వివాహానికి గూడమామడకు చెందిన ఇద్దరు, ఆదిలాబాద్ మండలంలోని చిచ్ధరి ఖానాపూర్‌కు చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనాలపై వెళ్లి వస్తూ ఒకరినొకరు ఢీకొనడంతో గూడమామడకు చెందిన బక్కుకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని జైవంత్ రావు ఉట్నూర్ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యం అందించాక బక్కు పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బక్కు మృతి చెందాడని, ఈ మేరకు ఉట్నూర్ పోలీసులకు సమాచారం ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

పేదల ఆర్థికస్థితిని పెంచడమే ‘ఉన్నతి’ పథకం లక్ష్యం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

ముథోల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీల కుటుంబాల్లో జీవనోపాధి మెరుగుపరిచేందుకు ‘ఉన్నతి’ కార్యక్రమం లక్ష్యం అని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని తరోడా గ్రామంలో గల రైతువేదికలో ఉన్నతి సభ్యులకు (ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాలకు) స్కిల్ డెవలప్‌మెంట్‌పై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం హాజరై మాట్లాడారు. అర్హులైన వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి వారికి ఆర్థికంగా ఎదిగేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ముథోల్ వ్యవ సాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ... రైతు లు వర్మీకంపోస్టు ఎరువు ద్వారా కూడా అధిక లాభాలు పొందవచ్చన్నారు. వర్మీకంపోస్టు తయారీ తదితర విషయాలను గుర్చి వివరించారు. ఈజీఎస్ ద్వారా పొందే రాయితీ, ఐకేపీ ద్వారా పొందే రుణాల సౌకర్యం గురించి సంబంధిత అధికారులు తెలిపారు. ఈ శిక్షణ 27వ తేదీ వరకు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీషరెడ్డి, డీపీఎం సాయిప్రసాద్, ఏపీఎం గురుచరణ్, ట్రైనర్స్ శివ కుమార్, సౌమ్య, రమేష్, సీసీలు పోశెట్టి, సూర్యకాంత్, వందేమాతరం, గోదావరి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉన్నతి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

యూనియన్ ఆధ్వర్యంలో వంటావార్పు

నిర్మల్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్స్ హెల్ప ర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లకు ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు చెల్లించాలని, ఎండాకాలంలో అంగన్‌వాడీ బడులకు మే నెల సెలవులు ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ 48 గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లలిత, జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా ఉపాధ్యక్షులు గంగామణి, రజియా, విజయ, ప్రసాద, భాగ్య, వనజ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫేర్‌వెల్ డే వేడుకలు

భైంసా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఫేర్‌వెల్ డే వేడుకలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకలలో భాగంగా పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతు ప్రతీ విద్యార్థి జీవిత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని అది సాధించేందుకు గాను ప్రణాళిబద్ధంగా ముందుకు సాగాలన్నారు.

క్రమశిక్షణతో బాగా చదివి మంచిపేరు సంపాదించుకోవాలి

సోన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో చదివి మంచిపేరు తెచ్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు నాళం విద్యాసాగర్, ఆరాధనలు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌తో పాటు న్యూ వెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ ప్రజాపాలన అంటూ ప్రగల్భాలు

● ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే 11 మందిపై అక్రమ కేసులు బనాయించారు ● పోలీసులపై కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తాం : బీఆర్ఎస్

ఖానాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ ప్రగల్భాలు పలుకుతుందని మాజీ జడ్పీటీసీ బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాథోడ్ రాము నాయక్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ ఖానాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిపై వేసిన సస్పెన్షన్ వేటును ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్‌లో ఈ నెల 14వ తేదీన తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేశామన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే అధికార పార్టీ నాయకులు పోలీసులను అడ్డం పెట్టుకుని తమ 11 మంది నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. 13వ తేదీన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖానాపూర్‌లో దహనం చేశారన్నారు. దిష్టిబొమ్మల దహనం నేరమైతే కాంగ్రెస్ నాయకులపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన పూర్తి ఆధారాలు, వార్తాపత్రిక కథనాలు, ఫోటోలు, వీడియోలు తమ వద్ద ఉన్నాయని కేవలం తమ పైన కేసులు నమోదు చేసి కాంగ్రెస్ వారిపై కేసులు నమోదు చేయని పోలీసులపై కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజ గంగన్న, పట్టణ అధ్యక్షులు గోరేకర్ రాజు, డీఆర్‌బీఎస్ మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, మస్కాపూర్ మాజీ సర్పంచ్ మహేందర్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, జిల్లా నాయకులు పుప్పాల గజేందర్, తోట సుమిత్, రాకేష్, మహిపాల్, అజయ్, నవీన్, ప్రణీత్, తదితరులున్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్ట్ సరికాదు

బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకులు సుద్దాల మహిపాల్, మునుగూరి ప్రణీత్‌లు అన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్, ఉస్మానియా యూనివర్సిటీపై విధించిన ఆంక్షలు ఎత్తి వేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్వీ నాయకులు సుద్దాల మహిపాల్, మునుగూరి ప్రణీత్, గందం లాజర్, సాయికృష్ణ, సల్ల వంశీ, సాయిలను అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు నిరసనలకు, ధర్నాలకు భయపడి ముందస్తు అరెస్టులు చేయించడం సిగ్గుచేటన్నారు. వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిపై వేసిన సస్పెన్షన్ వేటును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ నిరసనలను ఆందోళనలను మరింత తీవ్రతరణం చేస్తామని హెచ్చరించారు.

అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ఏకరువు పెట్టిన ముథోల్ ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలపై ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ మంగళవారం అసెంబ్లీలో ఏకరువు పెట్టారు. జీరోఅవర్‌లో ఆయన నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు సత్వరమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా రైతాంగానికి సాగునీటి వ్యవస్థ మెరుగుదల కోసం గాను చెరువులకు అవసరమైన మరమ్మతులు నిర్వహింపజేసేందుకు గాను నిధులు విడుదల చేయాలన్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల మూలంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వందకు పైగా చెరువులు దెబ్బతిన్నాయన్నారు. తద్వారా వాటిలో నీరు నిల్వ లేక భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. సాగునీటి కల్పన కోసం గాను దెబ్బతిన్న చెరువులన్నింటికీ మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రదక్షిణలు చేస్తున్న స్పందించే వారు కారరావడం లేదన్నారు. పరిష్కారం కానరావడం లేదన్నారు. తానూర్ మండలంలోని హిప్నెల్లి చెరువు మరమ్మత్తులకు రూ. 60లక్షలు, కుబీర్ మండలం డోడర్న చెరువుకు రూ. 90లక్షలు నిధులు మంజూరైనప్పటికీ ఫైనాన్స్ క్లియరెన్స్ కావడం లేదన్నారు. గత ప్రభుత్వం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం అభివృద్ధి కోసం గాను రూ. 42 కోట్లు మంజూరు చేసి వెనక్కి తీసుకుందన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ సంబంధిత నిధులను కేటాయించి అమ్మవారి క్షేత్రంలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో పనులు ఇప్పటి నుండే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాసర అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విధానాలు వీడనాడాలన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించని పక్షంలో దాతల ద్వారా విరాళాలు సేకరించి అవసరమైన పనులు చేపట్టేందుకు గాను అనుమతి ఇవ్వాలని కోరారు. ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రోడ్డును వంద మీటర్ల మేర తవ్వేశారని, అధికారం ఉందని ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇకనైనా బాధ్యతయుతమైన విధానాల ద్వారా ముథోల్ నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం గాను నిధులు కేటాయించాలన్నారు. బాసర అమ్మవారి క్షేత్ర ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

పసుపు నాణ్యత కోల్పోకుండా శుద్ధి చేసుకోవాలి

పెంబి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పసుపు నాణ్యత కోల్పోకుండా శుద్ధి చేసుకోవాలని పసుపు రైతులందరూ ప్రస్తుతం పసుపు కొమ్ములను ఏరి ఉడికించి పాలిష్ చేసే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్‌నాయక్ అన్నారు. మంగళవారం మందపల్లిలో రైతు కూన శ్రీనివాస్ పంట కల్లం వద్దకి వెళ్లి పసుపు ఉడికిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పసుపు అతిగా ఉడికించిన పసుపు కొమ్ములు నాణ్యత కోల్పోయి త్వరగా శిలీంద్ర బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, తద్వారా మార్కెట్‌లో పసుపుకు గిట్టుబాటు ధర లభించకుండా పోయే అవకాశం ఉందని రైతులకు సూచించారు. పసుపు ఉడికించేటప్పుడు నాణ్యత ప్రమాణాలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్, రైతులు కే. శ్రీనివాస్, మహేష్ తదితరులు ఉన్నారు.

కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉద్యోగులకు

వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలి

లక్ష్మణచాంద, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గత నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబసర్వేలో పాల్గొన్న ఉద్యోగులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ మంగళవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ సర్వేను విజయవంతం చేసి జిల్లాను మొదటివరుసలో ఉంచారన్నారు. సర్వే పూర్తి అయిన వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఇంతవరకు నాలుగు నెలలు గడిచిన ఉద్యోగ ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం చాలా బాధాకరం అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.

అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఖానాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం ఖానాపూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన కడమంచి లక్ష్మణ్ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇంద్రానగర్ కాలనీలోని తన ఇంటి వెనకాల ప్రహరీగోడ వద్ద నిల్వ చేశాడు. సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అధికధరకు అమ్మేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఘటన స్థలంలో పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకోవడంతో పాటు లక్ష్మణ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మార్కండేయ ఆలయ నిర్మాణానికి రూ. 31లక్షల నిధులు మంజూరు

భైంసా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శ్రీ మార్కండేయ ఆలయ నిర్మాణం కోసం గాను ప్రభుత్వం రూ. 31లక్షలు మంజూరు చేసిందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సంబంధిత నిధుల మంజూరి ప్రొసీడింగ్ పత్రాన్ని భైంసా పట్టణ పద్మాశాలి సంఘం ప్రతినిధులకు దేగాం గ్రామంలో అందజేశారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని భైంసా పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మహేష్, సలహాదారులు కాశీరాం, ప్రతినిధులు ధర్మపురి సాయినాథ్ ఘనంగా సన్మానించి మార్కండేయ చిత్రపటాన్ని బహూకరించారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పెరవార్ కృష్ణ, ప్రస్తుత డైరెక్టర్ తోట రాముతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహ నిర్మాణంపై కార్మికులకు అవగాహన

నిర్మల్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై భవన నిర్మాణ కార్మికులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రారంభించారు. గృహ నిర్మాణ పీడీ రాజేశ్వర్ హాజరై మాట్లాడుతూ... 5 లక్షల రూపాయలతో ఇళ్లను ఎలా నిర్మాణం చేయాలో వివరించారు. 6 రోజుల శిక్షణ కొనసాగుతుందన్నారు. ఏఈ షరీఫ్ మాట్లాడుతూ... కార్మికులకు శిక్షణ ఇవ్వడంతో కొలతలు, సెట్ బ్యాక్, తదితర వాటిపై అవగాహన కలుగుతుందని తెలిపారు. న్యాక్ సంస్థ ఇచ్చే సర్టిఫికెట్‌తో భవిష్యత్‌లో ప్రయోజనాలుంటాయన్నారు. కార్మికులకు హెల్మెట్, టి షర్ట్, బ్యాగులు అందజేశారు. ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. స్వదేశ్, మాస్టర్ ట్రైనీలు రమేష్, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించి విజయాన్ని సాధించాలి

భైంసా రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆనందిత ఫౌండేషన్ చైర్మన్, మోటివేషన్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు. అవి మన భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప అవకాశాలు అని చెప్పారు. ఒత్తిడిని అధిగమించాలంటే మంచి ప్రణాళిక, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం. పరీక్షకు ముందు సిలబస్‌ను సరైన విధంగా ప్రణాళిక చేసుకొని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గణపతి, శేఖర్ వర్మ, జలపతిరెడ్డి, అమిత్ నాయక్, టి. శ్రీనివాస్, మాలతి రెడ్డి, కే. రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు మంచినీటి కష్టాలు!

● అలంకారప్రాయంగా మంచినీటి ట్యాంకు ● చుక్క నీరందించని మిషన్ భగీరథ ● పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



గిరిజన గూడెం పిట్ల గూడెం



బోరుబావి వద్ద మంచినీటి కోసం బిందెలతో నిల్చున్న గ్రామస్థులు



పిట్ల గూడెంలో నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకు

ఉట్నూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు ముదరడంతో గిరిజన గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఉట్నూర్ మండలంలోని టక్కగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పిట్లగూడెంలో గిరిజనులు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. 300 జనాభాతో 55గిరిజన కుటుంబాలు జీవిస్తున్న పిట్లగూడెంలో రెండు బోరు బావులు ఉండగా బోరుబావుల్లో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో చాలాసేపు బోరుకొడితేనే నీరు వస్తున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఒక బోరు బావి నీరు తాగడానికి మాత్రమే పనికి వస్తుండగా మరో బోరు బావి నీరు బయట పనులకు వాడుతున్నామని గిరిజనులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఉన్న బోరుబావి వద్ద ఉదయం ఐదు గంటల నుంచి బిందెలు క్యూలో పెట్టి నీరు తీసుకోవాల్సి వస్తుందని, ముందు వచ్చినవారికి నీళ్లు లభిస్తున్నాయని గిరిజనులు పేర్కొంటున్నారు. నీటి కోసం ప్రతీరోజు తాము ముందుంటే తాము ముందని తగువులాడుకోవాల్సి వస్తుందని గిరిజనులు తెలిపారు.

మంచి నీటి ట్యాంకు అలంకార ప్రాయం!!

రెండు దశాబ్దాల క్రితం గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యా ంకు అలంకారప్రాయంగా మారిందని గిరిజనులు చెప్తున్నారు. గ్రామ పొలిమేరలో బోరువేసి ట్యాంకుకు నీరు అందించే ప్రయత్నం చేసినప్పటికీ బోరుబావి చెడిపోవడంతో అధికారులు సైతం నిమ్మకుండి పోయారని తెలిపారు. ప్ర భుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఉన్న ట్యాంకుకి నీరు అందిస్తామని చెప్పి అధికారులు ఇంటింటికీ నల్లాలు బిగించినా పదేళ్లుగా చుక్కనీరు రాలేదని గిరిజనులు మండిప డుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌ని ప్రశ్నించగా సమస్య తీవ్రత తెలుసుకొని మంచినీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. మంచినీటి ఎద్దడి ఏర్పడడంతో ప్రతీ రోజు బోరుబావి వద్దమ హిళలు తగువులాడుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా పిట్లగూడెంలోని మంచి నీటి ఎద్దడిని అధికారులు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఓట్ల కోసం వస్తారు!



● పట్టెపు సుజాత

ఓట్ల కోసం వస్తున్న ప్రజాప్రతినిధులు ఎన్నికలయ్యాక మా సమస్యను ఎవరూ పరిష్కరించడంలేదు. రెండు దశాబ్దాలుగా మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం.

భగీరథ నీరు రావడం లేదు



● పల్లి పోశవ్వ

మిషన్ భగీరథ నీరు ఇంతవరకు చుక్క నీరురాలేదు. పైప్‌లైన్లు వేసినా అవి పని చేయడంలేదు. బోరు బావుల వద్ద నీరు రాక ఇబ్బందులు పడుతున్నాం.



సోమవారం ప్రచురితమైన కథనం

ట్రిపుల్ ఐటీ మెస్ టెండర్ల నోటిఫికేషన్ విడుదల

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

బాసర, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ మెస్ టెండర్లకు ముందడుగు పడింది. మంగళవారం మెస్ టెండర్ల నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుతం క్యాంపస్‌లో 9వేల మంది విద్యార్థులకు మూడు సంస్థలు మెస్‌లను నిర్వహిస్తున్నాయి. వీటి కాంట్రాక్టు గడువు నాలుగేళ్ల కిందటే ముగిసింది. వీటిపై విద్యార్థుల ఫిర్యాదులు అనేకం ఉన్నాయి. వైస్‌చాన్సలర్‌లు మారినా ఇక్కడ గడువు ముగిసిన కాంట్రాక్టర్‌లు మారకపోవడంపై విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో సోమవారం 'కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యం.. అధికారుల చోద్యం' అనే శీర్షికన ప్రచురితమైన కథనం అధికారులు స్పందించారు. క్యాంపస్‌లో గడువు ముగిసిన కాంట్రాక్టు సంస్థలు కొనసాగుతుండడం సుదీర్ఘకాలంగా ఫిర్యాదులున్నప్పటికీ చర్యలు తీసుకోని విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన అ ధికారులు వెంటనే సోమవారమే మెస్‌టెండర్ల కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మంగళవారం పత్రికల్లో టెండరు నోటిఫికేషన్ విడుదలైంది.

మిగితా వాటి సంగతి ఏమిటి!?

క్యాంపస్‌లో మెస్ సంస్థల కాంట్రాక్టు గడువు ఒక్కటే కాదు హౌస్ కీపింగ్, సెక్యూరిటీ ఇతర దుకాణాలు, సూపర్ మార్కెట్, వంటి ప్రైవేటు సంస్థల కాంట్రాక్టు గడువు కూడా ముగిసి సంవత్సరాలు గడున్నాయి. పలు సంస్థలపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. అనేక సార్లు అధికారులు కూడా టెండర్లు వేస్తామని ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మెస్ టెండర్లను ఆహ్వానించిన అధికారులు గడువు ముగిసిన మిగితా సంస్థల విషయంలో కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ విద్యాసంవత్సరం ముగిసే వరకు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు కొనసాగాలనే ఆలోచనలో ప్రైవేటు సంస్థల వారు ఉన్నట్లు తెలిసింది. మరి యూనివర్సిటీ అధికారులు వెంటనే టెండరు పెడతారా లేదంటే జాప్యం చేస్తూ ఈ విద్యాసంవత్సరం ముగిసే వరకు కొనసాగిస్తారో వేచిచూడాలి.



RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEGDE TECHNOLOGIES
BASAR
NIRMAL (DISTRICT), TELANGANA - 504107

Ref: RGUKT-B/E-Proc/Catering Services/2025 Date: 18.03.2025

E-Procurement - Tender Notice

Online tenders are hereby invited from interested and eligible bidders for providing Catering Services Including Kitchen & Dining Hall Maintenance for different messes in RGUKT, Basar. Interested bidders can download and submit the bids online from 20-03-2025, 11.00 AM to 19-04-2025 up to 05.00 PM through www.tender.telangana.gov.in. For further details please visit our website: www.rgukt.ac.in

Sd/-
Administrative Officer

DIPR R.O.No. 11559 -PP/CL/ADVT/1/2024-25 Dt: 17-03-2025

● మంగళవారం విడుదలైన టెండరు నోటిఫికేషన్



ట్రిపుల్ ఐటీ క్యాంపస్



ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పీఎంశ్రీ బోర్డు

సాంకేతిక విద్యే లక్ష్యం

● పీఎం శ్రీ పథకంలో పాఠశాలలకు చేరిన ట్యాబ్‌లు



ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబులు

భైంసా, మార్చి18 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మొదటి, రెండోవిడతలో 20పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇప్పటికే ప్రత్యేక తరగతి గదులు, వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నారు. ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టు అంశాలను నేరుగా తమ చేతుల్లో ఉన్న ట్యాబులపై చూసే అవకాశం కల్పించారు. అందుకు గాను ఎంపిక చేయబడిన పాఠశాలలకు ట్యాబ్‌లు నేరుగా పంపిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని భైంసా పట్టణ పరిధిలో పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసిన ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని దేగాం ఉన్నత పాఠశాలకు ట్యాబ్‌లు చేరాయి. ఒక్కొక్క పాఠశాలకు 25 ట్యాబులను అందజేశారు. వీటిని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అందజేయనున్నారు. పాఠ్యాంశాలు బోధించే సమయంలో విద్యార్థులకు అందజేయనున్నారు. జిల్లాలో రెండో విడతలో ఎంపికచేసిన 20 పాఠశాలలకు 500 ట్యాబులు వచ్చినట్లు సమాచారం.

పాఠశాలలకు చేర్చుతున్నాం..

● రామారావు, డీఈవో, నిర్మల్

పీఎంశ్రీ పథకంలో భాగంగా ఎంపిక చేయబడిన పాఠశాలలకు ట్యాబ్‌లు చేరవేస్తున్నాం. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించే సమయంలో వీటిని విద్యార్థుల ద్వారా ఉపయోగిస్తారు. పాఠ్యాంశాలలోని సమస్యలను ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంది.

జాతీయ స్కోచ్ అవార్డుకు ఐటీడీఏ పీవో ఎంపిక



ఉట్నూర్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు జాతీయ స్వతంత్ర స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ బాలికల విద్యార్థులు పాఠశాలలో రక్త హీనతతో బాధపడుతున్న బాలికలకు వారానికి రెండు రోజులు ఇప్ప పువ్వు లడ్డు, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఐరన్ మాత్రలు అందించి గిరిజన విద్యార్థినుల్లో హిమోగ్లోబిన్ శాతం పెంచడానికి అమలు చేసిన గిరిజన పోషణ మిత్ర పథకం సత్ఫలితాలు ఇస్తుందని భావించారు. ఇది కాకుండా ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో గిరిజనులకు ఉపాధి కల్పించడానికి ఏర్పాటుచేసిన గిరిజన క్యాంటీన్ ద్వారా మధ్యాహ్న భోజనం రూ.5కే ప్రజలకు అందుబాటులోకి తెచ్చి అమలు చేయడంతో న్యూ ఢిల్లీకి చెందిన స్కోచ్ సమ్మిట్ ఈనెల 29న న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ నిర్వాహకులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తాను ఆహ్వానించారు.

ట్రిపుల్ ఐటీలో 22న ఎస్‌డీజీ సమ్మిట్

● పోస్టర్‌ను విడుదల చేసిన అధికారులు




పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూనివర్సిటీ అధికారులు

బాసర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ఈనెల 22న ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ఎస్‌డీజీ సమ్మిట్ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్‌డీ మురళి దర్శన్, ఏవో రణధీర్ సాగి విడుదల చేశారు. విద్యార్థి జావేద్ నేతృత్వంలో టీమ్ ట్రాన్స్‌ఫార్మ్ ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సహకార చర్య, వినూత్న పరిష్కారాల ప్రాముఖ్యత వంటివి ఈ సమ్మిట్‌లో ఉంటాయని పేర్కొన్నారు. సానుకూల మార్పును నడిపించడానికి ప్రపంచ ప్రభావాన్ని ప్రేరేపించడానికి ఈ సమ్మిట్ ఒక ముఖ్యమైన అడుగని వైస్ చాన్సలర్ పేర్కొన్నారు.

కమాట్‌వాడ ఉపాధ్యాయుడి బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అంతర్గం పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

భీంపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని భీంపూర్ మండలం కామట్‌వాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మంగళవారం అంతర్గంకు బదిలీచేశారు. కామట్‌వాడలో 11మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విషయంపై ఈనెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'తరగతులు ఐదు.. విద్యార్థులు 11మందే..' అనే శీర్షికన ప్రచురితమైంది. ఈ విషయాన్ని అంతర్గం గ్రామస్థుడు బక్కి కపిల్ యాదవ్ కలెక్టర్ రాజర్షిషా దృష్టికి తీసుకువెళ్లగా.. కలెక్టర్ ఆదేశాలమేరకు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అంతర్గంకు బదిలీ చేశారు.

అత్యవసరమైతే అంతే..

● అంబులెన్సు లేక గ్రామస్థుల అవస్థలు
● రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో సమయానికి చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్న క్షతగాత్రులు



కుభీర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు.. పాలకులు మారుతున్నా కుభీర్ మండలంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండలానికి ఒక్క అంబులెన్స్ కూడా లేక మండల ప్రజలు దశాబ్దాల కాలంగా అవస్థలు పడుతూనే ఉన్నారు. అత్యవసర, ప్రాణాపాయ స్థితిలో అంబులెన్స్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలకు గురైన బాధితులను అనారోగ్యంతో ఉన్న రోగులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించడానికి 108 అంబులెన్సు సౌకర్యం లేక మండలంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ మండలానికి ఒక ఆరోగ్య కేంద్రంతోపాటు దాని పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అంబులెన్సు సౌకర్యం కల్పిస్తోంది. మండలకేంద్రంలో ఆసుపత్రిలో గత 20ఏళ్లుగా అంబులెన్సు లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు.

● భైంసా పట్టణం నుంచి రావాల్సిందే..

కుభీర్ మండలంలో 42 గ్రామ పంచాయతీలు, 20 అనుబంధ గ్రామా లు ఉన్నాయి. సుమారు 65వేల జనాభా ఉంది. ఆయా గ్రామాల్లో ఎవరైనా ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడినప్పుడు వారిని ఆసుపత్రులకు తరలించాలించేందుకు నేటికీ ఒక్క అంబులెన్స్ కూడా లేదు. ఎంత పెద్ద ఆపదొచ్చినా భైంసా పట్టణం నుంచి అంబులెన్సు రావాల్సిందే. మండలా నికి ఒక్క అంబులెన్సూ లేక ప్రజల ప్రాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు 108కు ఫోన్ చేసినా కొన్నిసార్లు గంటకు పైగా సమయం అయినా రాకపోవడంతో కొందరు ప్రాణాపాయ స్థితిలోకి చేరగా మరి కొందరు క్షతగాత్రులు అవస్థలు పడుతున్నారు.

● ప్రజలపై ఆర్థిక భారం

రోగులైనా, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులైనా వారిని ఆసుపత్రులకు తరలించడానికి అంబులెన్సు లేక పోవడంతో ప్రయివేటు వాహనాల్లో తీసుకెళ్లాల్సి వస్తోంది. తమపై ఆర్థిక భారం పడుతుందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలైతే ఆ భారాన్ని మోయలేక దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి కుభీర్ ఆసుపత్రికి 108 వాహనాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం..



● అజయ్ జాదవ్, డొడర్న కిషన్ నాయక్ తండా గ్రామం

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నందపహాడ్, పార్డి(బి) గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్సుకు ఫోన్ చేసి గంటన్నర పాటు ఎదురుచూశాను. అయినా రాలేదు. ఇక రాదని ప్రయివేటు వాహనంలో భైంసా ఆసుపత్రికి తరలించాం. వృద్ధులు వ్యాధుల బారిన పడి లేవలేని స్థితిలో ప్రైవేటు వాహనాల్లో తరలిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. కుభీర్ మండలానికి 108 అంబులెన్సును మంజూరు చేయాలి.

జిల్లా అధికారులకు నివేదిస్తాం



● డా. వసుంధర, మండల వైద్యాధికారి, కుభీర్

కుభీర్ మండలానికి గతంలో 108 అంబులెన్సు మంజూరయినట్లు చెప్పారు. కానీ ఇప్పటికి వరకూ రాలేదు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్సు లేక రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి అంబులెన్సు మంజూరు చేయాలని నివేదికలను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తాము.






గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ


గుడిహత్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల విషయంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిలేష్ మహాజన్ అన్నారు. మంగళవారం సాయంత్రం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా ఎస్పీకి సిబ్బంది పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. జాతీయ రహదారి ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఉండాలని పోలీసులకు సూచించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాల నిర్వహించకుండా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకై పోలీసు యంత్రాంగం అహర్నిశలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై కే మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

- పదవీ కాలం ముగిసినా.. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో చక్రం తిప్పుతున్న తాజా మాజీలు
- చెప్పింది చేయకుంటే ఆర్టీఐ దరఖాస్తులతో బెదిరింపులు
- ఫేక్ డోర్ నెంబర్ల కోసం ఎంతకైనా బరితెగింపు
- అధికారుల విధులకు అడుగడుగునా ఆటంకాలు
- పాలనపై ప్రత్యేకదృష్టిని సారించాలంటున్న పట్టణవాసులు

బల్దియాలో.. బ్లాక్‌మెయిల్ దందా







ఆదిలాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ బల్దియాలో కొందరు నేతలు బ్లాక్ మెయిల్ దందాలకు ఎగబడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. బల్దియా పాలనా వ్యవహారాల్లో తల దూర్చుతూ అధికారులనే ముప్పుతిప్పలు పెడుతున్నట్లు తెలుస్తోంది. తాజా మాజీలతో పాటు కులసంఘాల నేతలు కూడా బల్దియా అధికారులపై పెత్తనం చెలాయించడం పరిపాటిగా మారిందంటున్నారు. ఇటీవల.. చెప్పింది చేయకుంటే ఓ మాజీ కౌన్సిలర్ భర్త అధికారులను దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ నేతపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రయత్నించగా.. ఓ ఉన్నత అధికారి ప్రమేయంతో మళ్లీ వెనక్కి తగ్గినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా.. ఇదంతా బల్దియాలో సర్వసాధారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గ పదవీ కాలం ముగిసిపోయినా.. ఇంకా కొందరు నేతలు బల్దియాలోనే మకాం వేస్తూ అడ్డగోలు దందాలకు తెరలేపుతున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది. కొందరు తాజా మాజీ నేతల వ్యవహార శైలితో విసుగెత్తిపోతున్నా.. అధికారులు విధులకు దూరంగా ఉంటున్నారు. దీంతో పాలనా వ్యవహారాలు సక్రమంగా ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కొంతమంది అధికారులు సెలవులపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటీవల రెవెన్యూ విభాగంలో ఓ సీనియర్ నేత సైతం జోక్యం చేసుకోవడం మున్సిపాలిటీలో హాట్ టాపిక్‌గా మారింది.

మేం చెప్పింది చేయాల్సిందే..!!

'పదవిలో లేకపోయినా మేం చెప్పింది చేయాల్సిందే' అంటూ కొందరు మాజీలు అధికారులకు హుకూం జారీ చేస్తున్నారు. డబ్బులు ఇస్తే మున్సిపాలిటీలో ఏదైనా సాధ్యమేనంటూ కొందరు నేతలు జోరుగా పైరవీలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాధ్యం కానీ పనులను చేయాలంటూ అధికారులపై తీవ్రమైన ఒత్తిళ్లు చేస్తున్నారు. కాదు కూడదు అంటే అధికారుల లొసగులను ఆసరగా చేసుకుంటూ అడ్డగోలుగా ఆర్టీఐ దరఖాస్తులతో అధికారులను ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్టీఐ దరఖాస్తులతో అధికారులను భయాబ్రాంతులకు గురిచేస్తూ పలువురు తాజా మాజీ నేతలతో పాటు ఓ కుల సంఘానికి చెందిన నేత వసూలు దందాకు ఎగబడుతున్నారు. నెలనెలా ఒక్కో అధికారి నుంచి రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇవ్వలేమంటే ఇక్కడ కుదరదని బెదిరింపులకు గురిచేస్తున్నారు. పైరవీలు చేయడమే పనిగా చేసుకుంటున్నా.. కొందరు నేతలు మున్సిపాలిటీని అడ్డాగా మార్చుకుని తమ దందాలు కొనసాగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు బల్దియాలోనే మకాం వేస్తూ పాలన వ్యవహారాలపై పెత్తనం చెలాయిస్తున్నారు. కనీసం కార్మికులకు చీపుర్లు, సున్నం, బ్లీచింగ్ పౌడర్ కొనే విషయంలోనూ ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం పెరిగిపోతోందని సంబంధిత అధికారులు వాపోతున్నారు.

వేలల్లో ఫేక్ డోర్ నెంబర్లు

ఎలాంటి నిర్మాణాలను చేపట్టకపోయినా.. అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్ ప్లాట్లకు ఫేక్ డోర్ నెంబర్లను కేటాయించడం మున్సిపాలిటీలో పరిపాటిగా మారింది. ఇప్పటికే వేలల్లో ఫేక్ డోర్ నెంబర్లను కేటాయించినట్లు తెలుస్తుంది. మున్సిపాలిటీలో జరుగుతున్న ఈ అక్రమ భాగోతాన్ని తెలుసుకుంటున్న కొందరు నేతలు తమకు ఫేక్ డోర్ నెంబర్లను కేటాయించాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇవ్వలేం.. చేయలేమంటే మీ దందాలపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామంటూ బ్లాక్ మెయిల్‌కు దిగుతున్నారు. ఫేక్ డోర్ నెంబర్లతో అసైన్డ్, ప్రభుత్వ వివాదాస్పద భూములను గుట్టుచప్పుడు గాకుండా రిజిస్ట్రేషన్ చేయిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. నేతల ఒత్తిళ్లతో మున్సిపాలిటీ అధికారులు కేటాయించిన ఫేక్ డోర్ నెంబర్‌లపై విచారణ జరిపిస్తే అసలు భాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు. కొంత

(తరువాయి 6వ పేజీలో...)



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

బోథ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ప్రజలు పండుగలు జరుపుకోవాలని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్ కోరారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కులమతాలకతీతంగా పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అలాగే ప్రశాంత జీవనం సాగించేందుకు ఒకరి మనోభావాలను దెబ్బ తినకుండా మరొకరు ఉండాలన్నారు. మనం చేసే పనులే ప్రజలు గుర్తుంచుకుంటారని, అయితే ప్రజల్లో మంచి పేరు సంపాదించుకునేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు అల్లకొండ పోతన్న, మైనార్టీల తరఫున ఇర్షద్ అలీతో పాటు వీడీసీ ఉపాధ్యక్షుడు, కోశాధికారి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఆయా సంఘాల సభ్యులు, యువకులు, వ్యాపారులు పాల్గొన్నారు.



నార్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో పేర్లను సరి చేస్తున్న దృశ్యం

బదిలీపై వెళ్లిన అధికారుల పేర్ల తొలగింపు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన రెవెన్యూ శాఖ

నార్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న బోర్డు సూచికపై ఆదివారం ప్రచురితమైన 'బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు' అనే కథనానికి రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. మంగళవారం బోర్డ్‌పై ఉన్న పేర్లను తొలగిస్తూ ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారుల పేర్లు రాయడం జరిగింది. ప్రాంత ప్రజలు సమస్యలపై నేరుగా కార్యాలయానికి వచ్చి అధికారులకు సంప్రదించాలని వారు కోరారు. లేనిపక్షంలో సూచిక బోర్డ్‌పై ఉన్న నెంబర్లకు ఫోన్ చేయాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'అంగన్‌వాడీ సమస్యలను చర్చించాలి'

ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి 18: అంగ్‌వాడీల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమెల్ల కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీలందరూ ఐసీడీఎస్ పరిరక్షణ, బలోపేతం కోసం పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని అనేక హామీలతో అధికారంలోకి వచ్చినా.. ఇప్పుడు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, నాయకులు సునీత, సుభద్ర, లక్ష్మ, భాగ్యశ్రీ, తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : హెచ్‌ఎం

ఉట్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలని మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చౌహాన్ శీతల్ అన్నారు. మంగళవారం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ఇందులో ఉపాధ్యాయులు సంగీత, సుజాత, మమత, మానశ్రీ, రవిత, శ్రీవాణి పంచపూల పాల్గొన్నారు.

ఉట్నూర్: మండలంలోని నర్సాపూర్(బీ)గిరిజన సంక్షేమ బాలికల విద్యార్థులు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు వేడుకను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాథోడ్ ప్రకాష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి భవిష్యత్తు గురించి మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారిలో కొందరు పాటలు పాడగా.. మరికొందరు నృత్యాలు చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.32 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4.59 (గురువారం ఉదయం)

ఆత్మీయుడైన సృష్టికర్తను మనిషి తనకు మరియు యావత్తు విశ్వానికి యజమాని, ఆరాధ్యుడని హృదయపూర్వకంగా అంగీకరించాలి. దైవత్వానికి సంబంధించిన సకల గుణగణాలు అధికారాలు సృష్టికర్తకే పరిమితమని విశ్వాసించాలి.



బోథ్‌లో పూజలు చేస్తున్న మైసమ్మగల్లీ కాలనీవాసులు

తాగునీటిఎద్దడిని తీర్చిన చేతిపంపునకు కాలనీవాసుల ప్రత్యేక పూజలు

బోథ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని స్థానిక మైసమ్మ గల్లీ కాలనీవాసులు మంగళవారం కాలనీలో ఉన్న చేతిపంపు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతేగాకు శాలువ కప్పి మరీ సన్మానం చేశారు. పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ ఎంతటి తీవ్రమైన నీటి ఎద్దడి వచ్చినా చేతిపంపు మాత్రం తాగునీటిని అందించిందని పేర్కొన్నారు. మంచినీటి ఎద్దడి తీవ్రమైతున్న సమయంలో ముందు నీటి ఎద్దడి లేకుండా చూడాలని గంగమ్మ తల్లిని కోరుకుంటున్నామని పలువురు కాలనీవాసులు పేర్కొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఆదివాసీ సంఘాలు

నార్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి ఉమ్మడి మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం సహకరించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం బాగా లేదని, పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ, సిబ్బంది లేరని తెలిపారు. దీంతో స్థానిక విద్యార్థులకు విద్యా బోధన సరిగా అందడం లేదని విన్నవించారు. వేసవి కాలంలో చాలా గ్రామా లకు నీటి సమస్యలు ఉంటాయని, అలాగే ధర్మగూడ, కునికాస మారేగావ్, హీరాపూర్ గ్రామాలకు నూతన పాఠశాల భవనాలు మంజూరు చేయాలన్నారు. సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్, ఇటీవల గుండాల గ్రామంలో ఓ రైతు చేన్‌లో గోధుమ పంట కాలిపోయిందని, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందాడి దౌలత్‌రావు, సార్మెడి పూసం బాదిరావు, కొడప జాకు, మెస్రం లింగు సంతోష్, మెస్రం శేఖర్, లింగు, దిలీప్ పాల్గొన్నారు.

'స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. వారి అహంకారానికి నిదర్శనం'

ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి 18: అసెంబ్లీలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్‌ఎస్ నేతలు అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, వారి అహంకారానికి నిదర్శమని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వారి ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దళితులకు రేవంత్‌రెడ్డి సర్కార్ పెద్దపీట వేసి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన స్పీకర్‌ను చేస్తే బీఆర్‌ఎస్ దురంహకారంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యాఖ్యాలను వెనక్కి తీసుకుని భేషరతుగా స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, నర్సింగ్, శ్రీనివాస్, సతీష్, వెంకన్న, రాజేశ్వర్, ఆశన్న, విఠల్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

కుష్టు వ్యాధి సర్వేకు సహకరించండి

- జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్

ఉట్నూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఈ 30వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు నిర్వహించనున్న ఇంటింటా సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు శ్యాంపూర్‌లో ఆయన ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2027 కల్లా దేశాన్ని కుష్టు రహిత దేశంగా మార్చేందుకు ప్రతియేటా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఆశా కార్యకర్తలు చేత ఇంటింటా సర్వే నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ఇళ్లను సందర్శించి ప్రతి ఒక్కరిని పరీక్షిస్తారని అన్నారు. అనుమానితుల పేరు నమోదు చేసుకొని సమీప ఆస్పత్రులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు బారిన మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్‌లు రావడం వంటి లక్షణాలు ఉన్నవారు తమ ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలకు స్వచ్ఛందంగా చూపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్ రావు, రమేష్, ఆరోగ్య పర్యవేక్షకులు నూర్ సింగ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ: కుష్టు నిర్మూలనే ధ్యేయమని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కుప్టి గ్రామంలో వైద్యులు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఎల్‌సీడీసీ సర్వే చేపట్టారు. కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవీందర్ పవార్, ఆరోగ్య పర్యవేక్షకుడు సంతోష్, ఆరోగ్య సహాయకుడు సాయన్న, ఆశ కార్యకర్త గంగమణి ఉన్నారు.



ఉట్నూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న జిల్లా అధికారి



- కుప్టిలో కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టిన దృశ్యం

తాంసి: కుష్టి వ్యాధి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ తులసిరాం కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు.

నార్నూర్: ప్రభుత్వ వైద్య సిబ్బంది మంగళవారం మండల కేంద్రంలోని భీంపూర్ తండా, గోండ్ గూడ, కొల్లంగూడ, కొత్తపల్లి గ్రామాల్లో చేపట్టిన కుష్టు వ్యాధిపై సర్వేను హెల్త్ సూపర్‌వైజర్ చవాన్ చరణ్‌దాస్ ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కుష్టుపై అనుమానం ఉంటే ఆశా కార్యకర్తలు సంప్రదించాలని కోరారు. ఇందులో ఆశా కార్యకర్తలు అరుణ, జాదవ్, సుజాత, మాజీ ఎంపీటీసీ రేణుక దిలీప్, కైలాష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

బోథ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బోథ్ ప్రాంతంలో అత్యల్ప వర్షాల కారణంగా భూగర్భ జలాలు అడుగండిపోతున్నాయని, దీంతో తాగునీటితో పాటు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని కరువు ప్రాంతంగా ప్రకటించాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ చైర్మన్ జి.రాజు యాదవ్, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురం సత్యవతి, కోటేశ్వర్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటిలు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి సందర్భంగా పలు సమస్యలను విన్నవించారు. వారు మాట్లాడుతూ రైతాంగం పంటలు ఎండుతున్న ఆవేదనతో చావాల్సి వస్తుందే తప్ప, పంట రక్షణ చేసుకోలేకపోతున్నారని అన్నారు. అలాగే నియోజకవర్గంలోని బోథ్, నేరడిగొండ, బజాతిర్‌హత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్ మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. తాగునీటికి ఇబ్బందులు ఇప్పుడే తలెత్తాయని మరోవైపు రైతాంగం సాగు చేసేందుకు కలెక్టర్ రాజర్షిషా దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా రైతులు, కూలీలు ఇబ్బందుల్లో ఉన్నందున ఉపాధి హామీ పని దినాలను పెంచాలని కోరారు. వర్షాకాలం నీరు వృధాగా పోకుండా అవసరమున్న చోట కందకాలు, చెక్ డ్యాములు. నీటి కుంటల నిర్మాణాలను చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు